ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శనివారం | నవంబరు 07, 2026 | సంపుటి : 7 | సంచిక : 132 | పేజీలు : 2

పరిషత్ ఎన్నికల్లో 70.72శాతం పోలింగ్



అమరావతి, ఆయుధం: ఏపీలో నిన్న జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 70.72శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగ్గా..తుది పోలింగ్ శాతాన్ని ఎస్ఈసీ శుక్రవారం ప్రకటించింది. విశాఖ జిల్లాలో నాలుగు జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. అత్యధికంగా 82.51శాతం, అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 62.01 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 65.51, అనకాపల్లి 75.58, అనంతపురం 64.38, అన్నమయ్య 69.19, చిత్తూరు 76.30, బాపట్ల 67.47, కృష్ణా జిల్లా 73.21, కోనసీమ జిల్లాలో 66.33 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



ఏపీలో పరిషత్ ఫలితాలకు ఏర్పాట్లు

- 28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలు

అమరావతి, ఆయుధం: ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేల మంది అభ్యర్థుల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో..అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో దాదాపు 30 వేల మందికి పైగా సిబ్బంది ఈ కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. ..: వివరాలు 2లో..)

రాజధానిలో వాయు కాలుష్యం

- అమల్లోకి మూడో దశ ఆంక్షలు

ఢిల్లీ, ఆయుధం:

దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వాయు కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. దీపావళి పండుగ వేళ వాయు నాణ్యత (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)-3ని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. దిల్లీలో గురువారం వాయునాణ్యత 382 మార్కును తాకింది.



ఏక్యూఐ 301400 మధ్య ఉంటే బాగా తక్కువగా ఉన్నట్లు లెక్క. అంతకుమించి నాణ్యత పడిపోయే అవకాశం ఉన్నప్పుడు గ్రాప్ 3 ఆంక్షల్ని అమలు చేస్తారు. దీపావళి సందర్భంగా కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రాప్ 3 ఆంక్షలు అమల్లోకి వస్తే.. అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధంతో పాటు, బీఎస్ 3 లేదా అంతకంటే పాత ప్రమాణాల పెట్రోల్ కార్లు, బీఎస్ 4 లేదా అంతకంటే పాత ప్రమాణాల డీజిల్ కార్ల రాకపోకలపై పరిమితులు విధిస్తారు. అంతేకాకుండా కంకర రోడ్లపై భవన నిర్మాణ సామగ్రిని తరలించకుండా నిషేధం విధిస్తారు. స్టోన్ క్రషర్స్, గనుల తవ్వకాలను నిలిపివేస్తారు.



జీవో 14 రద్దు చేసే వరకు దశలవారీగా పోరాటం

- బీసీల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, ఆయుధం: బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 14లో మార్పు చేయడాన్ని నిరసిస్తూ... బీసీ ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం కేయూ జంక్షన్ ఎస్టీఎస్సీ వద్ద ఉన్న మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహం వద్ద పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన భవన నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, కులవృత్తుల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతి సంవత్సరం బీసీ సంక్షేమానికి రూ.20 కోట్లు కేటాయించాల్సి ఉండగా, బడ్జెట్‌లో ఎంత కేటాయించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 42 శాతం రిజర్వేషన్లు, కాంట్రాక్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. గతంలో బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల కోసం కేటాయించిన భూములకు సంబంధించి పలు జీవోలు జారీ చేసి, చివరకు జీవో నంబర్ 14 తీసుకురావడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఈ జీవో కారణంగా బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, ఇతర కుల సంఘాల ప్రముఖ నాయకుల జయంతి వేడుకలు నిర్వహించుకోవడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కనీసం కార్యక్రమాలకు వచ్చే వారికి తాగునీరు, టీ, అల్పాహారం వంటి ఏర్పాట్లు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు చేపల పంపిణీ, బీసీలకు బీసీ బంధు వంటి పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా బీసీల ఆర్థిక అభివృద్ధికి ఎలాంటి ప్రత్యేక (మిగతా 2లో..)



కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తంరెడ్డిని గెలిపించాలి

వరంగల్, ఆయుధం: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు నియోజకవర్గం లో కొండా దంపతుల నాయకత్వంలో గ్రాడ్యుయేట్స్ ఓటర్ నమోదు చేయించి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని అత్యధిక మెజార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గం లో తెచ్చేందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమం వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బెడద వీరన్న, మాజీ డివిజన్ అధ్యక్షులు బోయిని దూడయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరుగగా.. కాంగ్రెస్ నాయకులు స్వయం శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బంగారు శ్రీనివాస్, డిసిసి కార్యదర్శి సంగారబోయిన చందర్, మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కలకుట్ల కుమార్, నాయకులు గిరి, కిరణ్, మాదాసి మధు, రాణి, లత, గడిపెల్లి ప్రవీణ్, రఘు, అభిషేక్, వీరన్న, చంటి, రాజు, రాధాకృష్ణ, శృతి, ఎల్లయ్య, ఇట్నేని ప్రతాప్, శ్రీనివాస్, రాంబాబు, ప్రభాకర్, సాగర్, శేఖర్, వినయ్, యూత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నరకాసుర వధ ఏర్పాట్లు పక్కాగా చేయాలి

- అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న

వరంగల్, ఆయుధం: నరకాసుర వధ కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలు సమకూర్చాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని రంగలీల మైదానం, రంగశాయిపేట మహాకాళి దేవాలయం వద్ద వేడుకల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు వెనుక సాయినగర్‌లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, ఏనుమాముల మార్కెట్ సమీపంలోని సుందరయ్య నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. హసన్‌పర్తిలోని ఎర్రగట్టు గుట్ట వద్ద నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణాల నాణ్యతను పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంజయ్ కుమార్, రవికుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ.. వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు సంయుక్త ప్రణాళిక రూపొందించాలి
- గుత్తికోయలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి
- ములుగు ప్రకృతి సంపదను కాపాడుతూ పర్యాటక అభివృద్ధికి కృషి
- ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ
- రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్



ములుగు, ఆయుధం: అటవీ సంపదను కాపాడుతూ, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో సంయుక్త ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శుక్రవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ బోర్డుదే హేమంత్ సహదేవ రావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాలతో కలిసి తాడ్వాయి అటవీ ప్రాంతం, ఏటూరునాగారం అభయారణ్యం, జలగలంచ దుర్గం గుట్ట ప్రాంతం, కొండాయి ఫారెస్ట్ వాచ్ టవర్ గుత్తికోయ హాబిటేషన్ ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల విశిష్టతలు, అటవీ సంరక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ, ప్రస్తుత పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుందరమైన ప్రకృతి, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల్లోని అటవీ అందాలను పరిశీలించాలని నిర్ణయించుకున్నానని, అందులో భాగంగానే ఈ పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. దట్టమైన అడవులు, సమృద్ధమైన జీవవైవిధ్యం ములుగు జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయని అన్నారు. వన్యప్రాణులను వేటాడటం అమానవీయమని, చట్టవిరుద్ధమైన ఇటువంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని తెలిపారు. ఇటీవల ఒక అడవి దున్నను వేటాడిన ఘటనను జిల్లా అటవీ అధికారి తన దృష్టికి తీసుకుపచ్చారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వాటి వెనుక ఉన్న కారణాలను సమగ్రంగా పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వేటను అరికట్టేందుకు పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అటవీ అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత వేగంగా స్పందించడం ఎంత అవసరమో, అసలు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. వన్యప్రాణుల వేట, అగ్నిప్రమాదాల నివారణకు కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, అటవీ సంరక్షణాధికారులు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందుకు రాష్ట్రప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గుత్తికోయల గుంపును సందర్శించి, వారి జీవన పరిస్థితులు, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. అడవులను నరికివేయకుండా జీవనోపాధి పొందేందుకు వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించవచ్చనే అంశంపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అడవులను నరికివేయడం (మిగతా 2లో..)



విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత 2లో

- తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు భైరబోయిన కైలాష్ యాదవ్

యాసంగి సీజన్‌లో.. పంటల మార్పిడి చేయండి

- ప్రొఫెసర్ జలపతిరావు

వరంగల్, ఆయుధం: ఎల్ నినో తో ప్రపంచవ్యాప్తంగా ప్రకృతిలో అనేక మార్పులు జరిగాయని, ఈ ప్రభావం వ్యవసాయ రంగంపై కూడా ఉందని వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జలపతిరావు అన్నారు. నగరంలోని అబ్బని కుంటలో ఉన్న తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో ఆ సంఘం నాయకులు రాష్ట్రస్థాయి వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొఫెసర్ జలపతిరావు మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలని జనుము, మినుములు, తెల్ల నువ్వులు తదితర పంటలు పండించుకోవాలని తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉంటాయన్నారు. రోజురోజుకు భూగర్భ జలాలు తగ్గుతాయని వరి మొక్కజొన్న పంటలు వేయడం వల్ల ఆఖరి దశలో నీరు అందక పంటలు ఎండిపోతాయని దీనిని రైతులు గుర్తించాలన్నారు. తక్కువ నీరుతో పండే పంటల ను సాగు చేయాలన్నారు. ఇదే యాసంగి సీజన్లో తమ తమ భూముల భూసార పరీక్షల చేయించుకోవాలన్నారు. తెలంగాణ రైతు సంఘం గౌరవ అధ్యక్షులు తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ మాట్లాడుతూ... మారిన వాతావరణ పరిస్థితుల్లో సరైన పంటలు పండించేందుకు ప్రభుత్వపరంగా ఉండే పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. రైతులు పండించిన పంట దళారుల పాలు చేయకుండా రైతులే సొసైటీలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి కావాలన్నారు. నాబార్డ్ ఇలాంటి జాతీయ సంస్థల ఉపయోగించుకోవాలని సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, తెలంగాణ ఉద్యమ నాయకులు సోమ రామ్మూర్తి, సేంద్రీయ వ్యవసాయ నిపుణులు షేక్ హుస్సేన్, నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ బుగ్గే శేఖర్, సంఘ ఉపాధ్యక్షులు హంసల్ రెడ్డి, ఆర్.దామోదర్ రెడ్డి, ముగిడే పీరయ్య, మోహన్ రావు, చిర్ల రవీందర్, బి.రవీందర్, ఎన్.విజయ్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.





జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- సాధారణ ప్రసవాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డెంగ్యూ, మలేరియా నియంత్రణకు విస్తృత చర్యలు చేపట్టాలి: కలెక్టర్ డా.సత్య శారద

ఏపీలో పరిషత్ ఫలితాలకు ఏర్పాట్లు

- 28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలు



అమరావతి, ఆయుధం: ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేల మంది అభ్యర్థుల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో..అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో దాదాపు 30 వేల మందికి పైగా సిబ్బంది ఈ కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. వేల సంఖ్యలో పోలీసు బందోబస్తు కూడా ఈ కౌంటింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమయ్యే కౌంటింగ్..తొలి ఫలితం వచ్చేసరికి కనీసం నాలుగు గంటలు సమయం పడుతుందని అంచనా.

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఈనెల 5న జరిగిన పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు తమ తీర్పును పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 70.72 శాతం ఓటింగ్ నమోదు కావడం ఓటర్లలో చైతన్యానికి నిదర్శనంగా ఉంది. వరదలు, తీవ్ర వర్షాల వల్ల పోలింగ్ వాయిదా పడ్డ 5 మండలాల్లో ఇవాళ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇవి కాక మరో మూడు జిల్లాల్లో వివిధ కారణాల వల్ల మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. వాటికి కూడా పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 28 జిల్లాల్లో మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11 వేలకు పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు విధులను నిర్వహించనున్నారు. వీరితోపాటు 28,500 మంది కౌంటింగ్ సిబ్బంది, సహాయకులు ఉంటారు.



గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ డా.సత్య శారద

వరంగల్, ఆయుధం: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో పాటు, పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన జిల్లా నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ కమిటీ సమావేశంలో తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ పనుల పురోగతి, నీటి నాణ్యత పరీక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవంబర్ 11న సంబంధిత గ్రామాలు గ్రామ పంచాయతీ సెక్రెటరీలతో మండలాల వారిగా సమీక్షలు నిర్వహించి నవంబర్ 15 నుండి డిసెంబర్ 31 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి సరఫరా వ్యవస్థలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, ఆర్ డబ్యూఎస్ ఈఈ నిర్మల, డియం అండ్ హెచ్ ఓ రాజి రెడ్డి, జడ్పీ సీఈవో వసంత, ఆత్మ పీడీ విజయ నిర్మల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ.. వన్యప్రాణుల రక్షణకు

పటిష్ఠ చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి..)

చట్టవిరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వారికి వివరించారు. అటవీ సంపదకు నష్టం కలిగించకుండా ఇతర ఉపాధి మార్గాల ద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. అభయారణ్యాన్ని మరింత మెరుగ్గా సంరక్షిస్తూ అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ప్రకృతి, అటవీ సంపదతోపాటు చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలు ములుగు జిల్లాలో ఉన్నాయని అన్నారు. అటవీ సంరక్షణ, పర్యాటక అభివృద్ధి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే జిల్లాలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యటనలో పరిశీలించిన అంశాలపై రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్కతో చర్చించి, ఆమె సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిన అనంతరం జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు కార్యాచరణ అవసరమని జయేశ్ రంజన్ తెలిపారు. వచ్చే నెల హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో ఈ అంశంపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, అటవీ జీవులతోపాటు అధిక ఉష్ణోగ్రతల్లో ఆరుబయట పనిచేసే కార్మికులు, గిగ్ వర్కర్లపై పడే ప్రభావాలను చర్చించనున్నట్లు వివరించారు. నిపుణుల సలహాలు, ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాల ఆధారంగా తక్షణ, ఏడాది, ఐదేళ్ల కాలానికి అవసరమైన చర్యలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభావం తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే సన్నద్ధమవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల

సాధనకు కృషి చేయాలి

- సాధారణ ప్రసవాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డెంగ్యూ, మలేరియా నియంత్రణకు విస్తృత చర్యలు చేపట్టాలి

వరంగల్, ఆయుధం: జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతి, లక్ష్యాల సాధనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణుల నమోదు, ఏఎన్‌సీ సేవలు, ప్రసవాల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, సిజేరియన్ ప్రసవాలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి కారణాలను విశ్లేషించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ గర్భస్రావాల నివారణకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, టీకా కార్యక్రమాలకు సంబంధించి యూవిన్ పోర్టల్‌లో పెండింగ్ వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. హైపర్‌టెన్షన్, మధుమేహ వ్యాధుల స్క్రీనింగ్‌ను వంద శాతం పూర్తి చేసి బాధితులకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎన్‌టీఈపీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుమలత అనంతరం కలెక్టర్‌ను కలిసి క్షయ నియంత్రణ కార్యక్రమంలో డీబీటీ ప్రక్రియను వేగవంతం చేయాలని, జోష్ టీమ్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాజిదా, డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, డాక్టర్ రవీందర్, డాక్టర్ మానస శ్యామల, వైద్యాధికారులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత

- తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు భైరబోయిన కైలాష్ యాదవ్
- ఘనంగా వరంగల్ జిల్లా సబ్ జూనియర్ జూడో జిల్లా స్థాయి పోటీలు



వరంగల్, ఆయుధం: చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు భైరబోయిన కైలాష్ యాదవ్ పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని ఓ సిటీ ఇండోర్ స్టేడియంలో వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా సబ్ జూనియర్ స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు భైరబోయిన కైలాష్ యాదవ్, ప్రత్యేక ఆహ్వాని దుర్గ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి అనిల్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా భైరబోయిన కైలాష్ యాదవ్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో సబ్ జూనియర్ స్థాయి జూడో పోటీలను నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమని, చిన్నతనం నుంచే విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, నాయకత్వ లక్షణాలను అలవర్చుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో తప్పనిసరిగా పాల్గొని తన ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆధునిక ఒలింపిక్ క్రీడల్లో జూడోకు ప్రత్యేక స్థానం ఉందని, ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంలో జూడో ఎంతో ఉపయోగకరమైన క్రీడ అని వివరించారు. నేటి సమాజంలో మహిళలు, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు జూడో శిక్షణ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ప్రతి యువతీ, యువకుడు జూడో క్రీడలో శిక్షణ పొందడం ద్వారా ఆత్మరక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని సాధించాలని ఆకాంక్షించారు. జూడో అనేది కేవలం పోటీలకు మాత్రమే పరిమితమైన క్రీడ కాదని, జీవితంలో క్రమశిక్షణ, గౌరవం, సంయమనం, పరస్పర సహకారం వంటి ఉన్నత విలువలను నేర్పించే గొప్ప క్రీడ అని పేర్కొన్నారు. జూడోలో శిక్షణ పొందిన ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పాటు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని సూచించారు.

ఈ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీలలో ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీలలో వరంగల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి వరంగల్ జిల్లా ఖ్యాతిని రాష్ట్రవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించే క్రీడాకారులను తగిన విధంగా గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, క్రీడాకారుల విజయాలు భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు శిక్షణ, ప్రోత్సాహం, సరైన వేదికలు కల్పిస్తే వరంగల్ జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభావంతులైన జూడో క్రీడాకారులు వెలుగులోకి వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి అనిల్, జూడో సంఘం నాయకులు సీహెచ్. సోమరాజ్, దుపాకి సంతోష్ కుమార్, నాయకపు నాగరాజు, నిశాంత్, ల్యాదెల్లా సంపత్, కుమార స్వామి, శ్రీనివాస్, లింగమూర్తి, జ్యోత్స్న, నాగరాజు, సంజయ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

- బాల్యవివాహాల నిర్మూలనకు 100 రోజుల విస్తృత ప్రచారం



రేగొండ, ఆయుధం: బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, భద్రత కల్పించాలనే లక్ష్యంతో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, షేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో 100 రోజుల విస్తృత అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. షేర్ ఎన్జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిరుపతి శాస్త్రాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రచారంలో భాగంగా రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా వర్కర్స్ డే కార్యక్రమంలో బాల్యవివాహాల నిర్మూలన పోస్టర్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన డీఎంహెచ్ఓ మధుసూదన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, సూపర్‌వైజర్ వినోదలక్ష్మి, కమ్యూనిటీ ఆఫీసర్, రేగొండ పీహెచ్‌సీ ఆశా యూనియన్ లీడర్ మైస రజిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించి, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. బాలికల విద్య ప్రాధాన్యత, బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరచనున్నారు. ఈ సందర్భంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిరుపతి శాస్త్రాల మాట్లాడుతూ.. బాల్యం బడిలోనే వికసించాలని, బాలికల భవిష్యత్తుకు బాల్యవివాహాలు అడ్డుకాకూడదని అన్నారు. చిన్నారుల హక్కులను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. "సమాజ హితమే మా ధ్యేయం.. బాల్యవివాహాలు లేని సమాజమే మా లక్ష్యం" అనే నినాదంతో 100 రోజుల ప్రచారాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండలానికి చెందిన సుమారు 80 మంది ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి సోషియల్ కుమార్, జేఆర్‌సీ సోషల్ మొబిలైజర్ బలుగూరి వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు



వరంగల్, ఆయుధం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడిన యోధుడు, పేద ప్రజల హక్కుల కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట స్ఫూర్తి ప్రదాత నల్లా నర్సింహులు అని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా నర్సింహులు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం అన్నారు. అణగారిన వర్గాల విముక్తి కోసం ఆయన చూపిన తెగువ, ధైర్యం, త్యాగం భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, పేద ప్రజల హక్కుల సాధన కోసం ఆయన సాగించిన పోరాట మార్గం మనందరికీ ఆదర్శం అని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయడమే మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. తెలంగాణ వీర చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు.

10న వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా

- సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకోవాలని, కరువు మండలాలు, ప్రాంతాలను గుర్తించి నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. షేక్ బాష్ మియా మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని పెట్టుబడులు పెట్టిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే చేయించి నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ''వరంగల్ జిల్లాలోని అన్ని కరువు ప్రభావిత మండలాలు ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి. నష్టపోయిన వరి పంటకు ఎకరానికి రూ.30,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. నష్టపోయిన పత్తి పంటకు ఎకరానికి రూ.50,000 చొప్పున నష్టపరిహారం అందించాలి. వ్యవసాయ అధికారులతో తక్షణమే పంట నష్టం సర్వే నిర్వహించాలి. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. సాగునీటి సమస్యను పరిష్కరించి రైతులకు అవసరమైన నీటిని అందించాలి. రైతులకు పంట పెట్టుబడి సాయం గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలి. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు నవంబర్ 10, 2026న వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో జిల్లా కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని షేక్ బాష్ మియా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, సంఘీ ఎలేందర్, అక్క పెళ్లి రమేష్, కందిక చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, జిల్లా సమితి సభ్యులు దామెర కృష్ణ, రహేలా, తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి. అక్బర్ పాషా, జన్ను రవి, పరికరాల రమేష్, మస్కా సుధీర్, కుమార స్వామి, గోవర్ధన చారి, ఏకాంబ్రాచారి, ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పార్థసారథి, ల్యాదల్ల శరత్, చిట్యాల సువర్ణ, బొట్ల శ్రీనివాస్, ప్రభాకర్, బొడ్డు పెళ్లి సాయిలు, పత్తి అనంతరెడ్డి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో మంటలు.. నాలుగు బోగీలు దగ్ధం




జాతీయం, ఆయుధం: పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి జల్పాయ్‌గుడికి వెళ్తున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 4 కోచ్‌ల్లో మంటలు వ్యాపించడంతో అందులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రయాణికులు అప్రమత్తమై ముందుగా దిగిపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటనతో సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో రైలును నిలిపేశారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. విద్యుదాఘాతం కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు సమాచారం. ఘటనా స్థలం నుంచి ప్రయాణికులను సురక్షితంగా తరలించేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి.



మేకల రవి కుటుంబానికి సీపీఐ జాతీయ నేత పరామర్శ

వరంగల్, ఆయుధం: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి మేకల రవి మృతి పట్ల సీపీఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శివనగర్ శుక్రవారం మేకల రవి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మేకల రవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కామ్రేడ్ మేకల రవి తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు కార్మిక కర్షక పేద ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితం చేసిన నాయకుడని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ భూ పోరాటాల్లోనూ ప్రజా సమస్యలపై జరిగిన అనేక ఆందోళనలు ధర్నాలు రాస్తారోకోలు నిరాహార దీక్షల్లోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. మేకల రవి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి వరంగల్ జిల్లా ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగీ ఏలేందర్, గుండె బద్రి, అక్క పెళ్లి రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు యాకాంబ్ర చారి, రాచర్ల రాజేందర్, నాయకులు, కార్యకర్తలు, మేకల రవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రింటర్ సొసైటీ సభ్యులకు

దీపావళి కానుక

- 50 గ్రాముల సిల్వర్ కాయిన్ అందజేత

హనుమకొండ, ఆయుధం: హనుమకొండలోని ప్రింటర్స్ సొసైటీ సభ్యులకు దీపావళి కానుకగా.. ధన త్రయోదశి సందర్భంగా "వెండి పతకము" పంపిణీ చేశారు. హనుమకొండ ప్రింటర్స్ సొసైటీ అధ్యక్షులు మాటేటి సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే మన సభ్యులకు బహుమతులు అందజేస్తామని సంఘ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నీలం రాజు, కోశాధికారి వెంకటరావు, ఉపాధ్యక్షులు ఓరుగంటి అశోక్, వెంకటేశ్వర్లు, సభ్యులు అన్న సతీశ్, మహేందర్ రెడ్డి, సాంబరాజు, భాస్కర్, రమేష్, రెడ్డి, కోటి, నవీన్, పెంటన్న గౌరవ సలహాదారులు తెలుకల రాజేందర్ రెడ్డి, ఓరుగంటి రవి కుమార్, కుసుమ రాజేందర్, బాలరాజు, విజయవంతం చేశారు.

జీవో 14 రద్దు చేసే వరకు పోరాటం

(మొదటి పేజీ తరువాయి..)

కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. కులవృత్తులపై ఆధారపడిన వర్గాలు పోటీ ప్రపంచంలో ఉపాధి కోల్పోతున్నాయని పేర్కొన్నారు. నేత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాలకు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. చెరువులపై ఆధారపడి జీవించే మత్స్యకారుల ఉపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చెరువుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి సంబంధించిన భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 14 వెనుక పెద్ద కుట్ర ఉందని, బీసీలకు కేటాయించిన స్థలాల విషయంలో అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆరోపించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695